క్లుప్తంగా

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సింగవరంలో సాయిబాబా విగ్రహం

కొయ్యూరు: చీడిపాలెం పంచాయతీ సింగవరంలో షిర్డీ సాయిబాబా ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భారీ అన్నసమారాధన జరపనున్నట్టు కమిటీ సభ్యులు గురువారం తెలిపారు.

చింతలపూడిలో వైద్య శిబిరం



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

కొయ్యూరు: నాబార్డు–రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చింతలపూడిలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాజేంద్రపాలెం వైద్యులు మనోజ్ఞ వైద్యసేవలందించారు. రాంకీ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ హరికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ తప్పనిసరి



ముసిరిలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్థక శాఖ సిబ్బంది

దుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ లోగేలి, గసభ, గొందిగుడ, జంగిడివలస, అద్రగుడ, నువ్వగుడ తదితర గ్రామాల్లో 1521 మేకలు,గొర్రెలకు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గౌతమ్ మాట్లాడుతూ గొర్రెలు,మేకలకు ఎటువంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని తెలిపారు.

పీవీటీజీలపై సర్వే

రాజవొమ్మంగి: పీవీటీజీల జీవితం, ఆచార వ్యవహారాలు, వారికి అవసరమైన మౌలికవసతులపై త్వరలో సర్వే నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బాపన్నదొర తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో గురువారం అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, వీఆర్వోలు, గ్రామకార్యదర్శులతో ఈ సర్వేపై ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీటీజీల విద్య, వైద్యం, సౌకర్యాలు తదితర 19 అంశాలపై సర్వే చేయాలని తెలిపారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోల ఆదేశాల మేరకు ఈ సర్వే చేపడుతున్నామని చెప్పారు.

ఘనంగా నల్లమారమ్మ జాతర



ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: కొండల అగ్రహారంలో నల్లమారమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు గురువారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమరావతి ట్రావెల్స్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుడు గూడూరు వెంకటరాజు, సర్పంచ్ పోలిరెడ్డి అచ్చియ్యమ్మ, చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ పాల్గొన్నారు.

కొత్తకొత్తగా..

- రూపురేఖలు మారిన కొత్తవలస పాఠశాల
- అందుబాటులోకి సౌకర్యాలు
- విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులు



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో విద్యార్థులు



నాడు నేడులో అభివృద్ధి చేసిన కొత్తవలస పాఠశాల

అనంతగిరి: మండలంలోని కొత్తవలస పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారాయి. గతంలో సమస్యలతో స్వాగతం పలికే ఈ పాఠశాల ఇప్పుడు సకలసౌకర్యాలతో ఆహ్లాదవాతావరణంలో దర్శనమిస్తోంది. బోధన, సౌకర్యాలు మెరుగుపడడంతో విద్యార్థులు చదువుపై దృష్టిసారించారు. క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. దీంతో ఈ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో రూ.42 లక్షల వ్యయంతో పాఠశాలను అభివృద్ధి చేశారు. మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్ సౌకర్యం కల్పించడంతో పాటు తరగతి గదులకు మరమ్మతులు చేసి, విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ప్రయోగాత్మకంగా పాఠ్యాంశాలను అవగాహన చేసుకుంటున్నారు.

గిరిజన విజ్ఞాన సంబరాల్లో ప్రతిభ

పాడేరు తలారిసింగి పాఠశాలలో జరిగిన గిరిజన విజ్ఞాన సంబరాల్లో ఈ పాఠశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు సైన్స్, గణితం విభాగాల్లో ప్రతిభ కనబరిచారు.



రాష్ట్రస్థాయిలో పోటీల్లో రాణించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

క్రీడాల్లో రాణిస్తున్న విదార్థులు

విశాఖపట్నంలోని జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన కె.దేవదాస్ కోకోలో ద్వితీయస్థానం, 1500 మీటర్ల మారథాన్‌లో వి.రాంబాబు ద్వితీయస్థానంలో నిలిచారు.

పాఠశాల అభివృద్ధికి కృషి



నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి చెందింది. నా సొంత సొమ్ముతో పాటు ఉపాధ్యాయుల సహకారంతో గ్రంథాలయం, ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మరింత సుందరంగా పాఠశాలను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నాం. విద్యార్థులు భవిష్యత్‌కు మంచి పునాది వేయాలన్నాదే లక్ష్యం.

– భాస్కరరావు, హెచ్‌ఎం కొత్తవలస పాఠశాల

సమయపాలన పాటించకుంటే చర్యలు

ఎంపీడీవో లాలం సీతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లిరూరల్: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో లాలం సీతయ్య హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయపాలన పాటించని వారి జీతాలు నిలిపివేస్తారని తెలిపారు. ఇంటి పన్నులను వచ్చేనెల 15వతేదీ లోపు కచ్చితంగా వసూలు చేయాలని సూచించారు. ఫైబర్ నెట్ సౌకర్యం కావలసిన గ్రామాల వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో అందజేయాలన్నారు. పోషకాహార లోపం గల పిల్లల వివరాలను ఏఎన్‌ఎం,మహిళ పోలీసులు సేకరించి అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు స్నాక్స్



హెచ్‌ఎం చిచ్చడి బాబూరావుకు నగదు అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

కూనవరం: వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో ప్రతీ రోజు సాయంత్రం స్నాక్స్ అందించాలని పేరెంట్స్ కమిటీ తీర్మానించింది. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ప్రతీ రోజు వీరికి అదనపు క్లాసులు నిర్వహిస్తున్నందున ఇళ్లకు వెళ్లి వచ్చే అవకాశం ఉండదు. అందువల్ల సాయంత్రం వేళలో స్నాక్స్ ఇవ్వడం మేలని కమిటీ సభ్యులు భావించారు. అందుకు స్పందించిన టేకులబోరు సాయిరామ్ మెడికల్‌షాపు యజమాని డాక్టర్ సుబ్రహ్మణ్యం ముందుకొచ్చి తనవంతుగా రూ.5,000 నగదును హెచ్‌ఎం చిచ్చడి బాబూరావుకు అందజేశారు. 40 రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక క్లాసులకు మరింత మంది దాతలు సహకారం అందించాలని కమిటీ సభ్యులు కోరారు.

చిరుధాన్యాల పంటలతో అదనపు ఆదాయం

జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి



కె.జె.పురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ ఆశాదేవి

మాడుగుల రూరల్: రైతులు చిరుధాన్యాల పంటలు పండించి అదనపు ఆదాయం సంపాదించుకోవాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు ఎం. ఆశాదేవి సూచించారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం కె.జె.పురం సూరిశెట్టి గోవిందరాజు కళ్లాల వద్ద చిరుధాన్యాల ఉపయోగం, వాటి ఆవశ్యకతపై ఆమె అవగాహన కల్పించారు. ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. వీటిని వినియోగం వల్ల ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. వరి పంటకు బదులు ప్రతి రైతు చిరుధాన్యాలు పండించుకోవడం ద్వారా ఇటు ఆదాయం పెంచుకోవడంతోపాటు అటు మనకు మంచి ఆరోగ్యం ఇస్తుందన్నారు. జిల్లా రిసోర్సు శిక్షణ కేంద్రం సమన్వయకర్త టి. దాసు మాట్లాడుతూ ఫాస్ట్ ఫుడ్స్ వల్ల ఒరిగిందేమి లేదన్నారు. అనంతరం కె.జె.పురం – ఎం. కోటపాడు గ్రామాల మధ్య బాలోజు పొలంలో మినప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. సేంద్రియ విధానంలో నీమాస్త్రం తయారీని రైతులకు చూపించారు. ఆరుతడి పంటలతో భూమి సారవంతంగా మారుతుందని నర్సీపట్నం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు వి. మోహన్‌రావు సూచించారు. ఏవో ఎం.వాసుదేవరావు, జిల్లా రిసోర్సు శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారులు విజేత, తుల సీమణి, సర్పంచ్ జామి రమణబాబు, ప్రకృతి వ్యవసాయం మండల ఎంకర్ గండి శ్రీనివాసరావు, వీఏఏలు, వీహెచ్ఏలు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవరంలో పొలంబడి



రాజవరంలో పొలంబడి నిర్వహిస్తున్న దృశ్యం

గంగవరం : గిరిజన రైతులు నాణ్యమైన పంటను సాగు చేసేందుకు వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి కె.విశ్వనాథ్ అన్నారు. గురువారం రాజవరంలో వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. గిరిజన రైతులు వివిధ సాగు పద్ధతులు, వరిలో సస్య రక్షణ చర్యలు వివరించారు. వరి సాగు చేసే 30 మంది గిరిజన రైతులకు శిక్షణ ఇచ్చారు.

రోడ్లపై చెత్త వేస్తే అపరాధ రుసుం

- డీఆర్‌పీసీ జిల్లా సమన్వయకర్త నాగలక్ష్మి



కె.జె.పురంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగలక్ష్మి తదితర్లు

మాడుగుల రూరల్: రోడ్ల మీద చెత్త వేస్తే అపరాధ రుసుం విధించాలని చెత్త నుంచి సంపద కేంద్రాల జిల్లా సమన్వయకర్త కె. నాగలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆమె కె.జె.పురం, వి.వి. అగ్రహారం, జి. అగ్రహారం, ముకుందపురం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా తడి, పొడి చెత్తను ఇంటింటికి వెళ్లి సేకరించి, చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. అక్కడ వర్మీ కంపోస్టును తయారు చేయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించేటట్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శులు పెంకి శివ, సింహాచలం, నాగేశ్వరావు, రమేశ్ పాల్గొన్నారు.

నిద్రమత్తు వల్లే అధిక రోడ్డు ప్రమాదాలు



డ్రైవర్‌తో ముఖం కడిగిస్తున్న పోలీసులు

అరకులోయ రూరల్: నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐ జి.డి.బాబు తెలిపారు. ప్రమాదాలను నివారించడానికి ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అరకులోయలో గురువారం స్టాప్ అండ్ ఫేస్ వాష్ అనే కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.రాత్రి, తెల్లవారు జామున ప్రయాణాలు చేయరాదని సూచించారు. ప్రమాదాలు నివారించేందుకు ప్రతీ రోజు తెల్లవారుజాము 2గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు స్టాప్ అండ్ ఫేస్ వాష్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



పడిపోయిన విద్యుత్తు స్తంభం

చింతపల్లి: మండలంలో గడపరాయి గ్రామంలో గురువారం నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభం విరిగి పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా ఈ స్తంభం నిరుపయోగంగా ఉందని, ఇనుప స్తంభం కావటం వల్ల కింద భాగంలో తుప్పు పట్టి పడిపోయిందని స్థానికులు తెలిపారు.

హెచ్‌ఎంకు అప్పలనాయుడుకు సన్మానం



అప్పలనాయుడును సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గంగవరం : గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొంది టేకులవీధి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన అప్పలనాయుడును యూటీఎఫ్ మండలశాఖ గురువారం సన్మానించింది. యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు కె.రఘుబాబు, జిల్లా కోశాధికారి కె.కృష్ణ , మండలశాఖ ప్రధాన కార్యదర్శి రాంబాబు, కొత్తాడ ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం తుర్రం బాబూరావు తదితరులు ఆయనను అభినందించి సన్మానించారు.

కలాసీల సమావేశం రేపు

జి.మాడుగుల: అరకులోయ జీసీసీ గోడౌన్ ఆవరణలో ఈ నెల 18న జీసీసీ కలాసీల సమస్యలపై సమావేశం నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు, హమాలీల సంఘం నాయకులు తెలిపారు. సమస్యలపై పాడేరు జీసీసీ డీఎంకు, సివిల్ సప్లయ్ డీఎంలకు వినతిపత్రం అందజేస్తున్నట్టు చెప్పారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



తలపడుతున్న గబ్బాడ, బుచ్చింపేట జట్లు

రోలుగుంట: మహా శివరాత్రోత్సవాలు పురస్కరించుకుని బుచ్చింపేటలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం, రోలుగుంట, తదితర మండలాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. తొలిరోజు గబ్బాడ, బుచ్చింపేట జట్లు పోటీపడ్డాయి. ఆలయాభివృద్ధికి, అన్నసమారాధనకు భక్తులు సాయం చేయాలని నిర్వాహకులు కోరారు. 9550610503, 9493960276, 9848656337 సంప్రదించాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

అడ్డతీగల: పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఎంఈవో వై.మల్లేశ్వరరావు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్‌లను పరిశీలించి, విద్యార్థుల నోటు పుస్తకాలు,వర్క్‌బుక్‌లను చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను తప్పనిసరిగా ప్రతీరోజు ఉపయోగించేలా పర్యవేక్షించాలన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

- సబ్ కలెక్టర్ అభిషేక్



మత్స్యగుండంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్



ఉత్సవకమిటీ సభ్యులతో మాట్లాడుతున్న అడిసనల్ ఎస్పీ తుహిన్ సిన్హా

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో శుక్రవారం నుంచి జరగనున్న మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ సూచించారు. గురువారం ఆయన మత్స్యగుండంలో మత్స్యలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం మత్స్యగుండంలోని ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యగుండంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాలని ఆదేశించారు. మత్స్యగెడ్డలోకి భక్తులెవరూ దిగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరావు,తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎస్ఐ సతీష్, సర్పంచ్ శాంతకుమారి, కమిటీ సభ్యులు సింహాచలం,మత్స్యకొండబాబు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు: అడిషనల్ ఎస్పీ తుహిన్ సిన్హా

హుకుంపేట: మత్స్యగుండంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం ఆయన మత్స్యగుండాన్ని సందర్శించి, ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో 220 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నట్టు చెప్పారు. జాతరకు వచ్చే భక్తులు ప్రశాంతంగా దైవదర్శనం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధకార్,స్థానిక ఎస్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థిని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కానెం ఈశ్వరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని ముసినిగుంట గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కానెం ఈశ్వరి దేవి కుటుంబాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పరామర్శించి, ప్రభుత్వం తరఫున న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఇందుకూరు ఆర్ అండ్ ఆర్ పునరావాస కాలనీలో నివసిస్తున్న ఈశ్వరి తల్లిదండ్రులు కానెం చిన్నారావుకు, సన్యాసమ్మను గురువారం ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. ఎమ్మెల్యే ఎంపీపీ కుంజం మురళి, జెడ్పీటీసీ శిరసం సత్యవేణి పెద్దబ్బాయి దొర, కట్టా సత్యనారాయణ, వైస్ ఎంపీపీ గారపాటి మురళీకృష్ణ, మట్ల రాంబాబు, మంటూరు ప్రసాద్,సర్పంచ్ కోసు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.సుధాకర్, ఎస్ఐ సంతోష్ కుమార్

వై.రామవరం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పూతిగుంట పరమేశ్వరుని, గురమంద విశ్వనాథుని ఆలయాలను గురువారం తహసీల్దార్ కె.సుధాకర్, ఎస్ఐ సంతోష్ కుమార్ సందర్శించారు. ఏర్పాట్లతోపాటు భక్తులకు కల్పించిన సౌకర్యాలు, వాహన పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు.

ఆలయ కమిటీలకు పలు సూచనలు చేశారు. గురమంద ఆలయ కమిటీ సభ్యులు పల్లాల వెంకటరమణారెడ్డి, పూతిగుంట ఆలయ కమిటీ సభ్యులు బచ్చలి రమేష్, కలిమెల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయండి

- అధికారులతో నర్సీపట్నం ఆర్డీవో జయరాం సమీక్ష



రిజర్వాయర్‌లో స్నానాల రేవును పరిశీలిస్తున్న జయరాం

రావికమతం: కల్యాణపులోవ తిరునాళ్లను విజయవంతం చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆదేశించారు. కల్యాణపులోవలో ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్లకు రోజుకు లక్షకుపైగా యాత్రీకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు స్నానాల రేవులో గజ ఈతగాళ్లను, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. డ్యామ్‌పైకి వెళ్లకుండా రక్షణ కంచె, యాత్రీకులకు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికపుడు చెత్తను తొలగించాలన్నారు. తిరునాళ్ల పూర్తయ్యే వరకూ ఎవ్వరూ సెలవులు పెట్టవద్దని సూచించారు. తహసీల్దార్ మహేశ్వరరావు, కొత్తకోట సీఐ మహమ్మద్, ఎంపీడీవో వెంకన్నబాబు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్ ఒంజరి గంగరాజు, ట్రస్టు బోర్డు చైర్మన్ పాడి పోతురాజు, ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు



అక్రమ లేఅవుట్ వద్ద బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

మాకవరపాలెం: అక్రమంగా లేఅవుట్లు వేస్తే చర్యలు తప్పవని ఈవోపీఆర్డీ సీతామహాలక్ష్మి హెచ్చరించారు. పైడిపాల రెవెన్యూలోని 699, 709 సర్వే నంబర్లలో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారు. వీటిని గుర్తించిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు గురువారం అక్కడ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ ఈ లేఅవుట్‌లో ఎవరైనా స్థలాలు కొనుగోలు చేసినా చెల్లదని స్పష్టం చేశారు.